
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 31 జనవరి 2024

డీకేటీ భూములు
లాక్కుంటున్నారు...!





జగనన్న స్మార్ట్‌సిటీ పక్కన సర్వే నెంబరు 557లో చదును చేసిన సరస్వతమ్మ భూమి


- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో పేదల భూములు కబ్జా
- కలెక్టరేట్ ఉద్యోగినంటూ ఓ వ్యక్తి ఆక్రమణల పర్వం
- అధికార పార్టీ నేతలు కొంత.. అధికారులు మరికొంత
- పేదల భూములను లాక్కుంటున్న వైనం

రాయచోటిటౌన్, జనవరి 30: అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అక్రమార్కులు రాయచోటి చుట్టుపక్కల డీకేటీ భూములపై కన్నేసి పేదలకు చెందిన భూములను దౌర్జన్యంగా లాక్కుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో అధికారులు కొంత లాక్కుంటుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారాల పేరుతో అధికార పార్టీ నాయకులకు సంబంధించిన వ్యక్తులు పేదల భూములను కబ్జా చేస్తూ వారిని రోడ్డున పడేస్తున్నారు. రాయచోటి పట్టణం జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి చుట్టుపక్కల భూములకు ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ నేతలు అధికారుల అండదండలతో పేద భూములపై కన్నేసి డీకేటీ భూములతో పాటు వంకలు, వాగులు, పొరంబోకు భూములను ఆక్రమించేసి చదును చేసి ప్లాట్లు వేసి దర్జాగా కోట్లాది రూపాయలకు విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ కేవలం ఫిర్యాదులపై విచారణలు చేపడుతున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. అధికారుల వద్దకు వెళ్లినా, స్పందనలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



ఎకరా స్థలం ఆక్రమించి ప్లాట్లు వేశారు

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు ఆనుకుని సర్వే నెంబరు-557లో రామాపురం మండలం పొత్తుకూరుపల్లికి చెందిన కేతంరెడ్డి సరస్వతమ్మకు ఎకరా భూమి ఉంది. ఈ భూమి పక్కనే ఉన్న 7 ఎకరాల డీకేటీ భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తి సరస్వతమ్మకు సంబంధించిన ఎకరా భూమిని అక్రమంగా తన భూమిలో కలిపేసి చదును చేసి ప్లాట్లు వేసి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఆ వ్యక్తి కలెక్టరేట్‌లో పనిచేస్తున్నానంటూ గొప్పలు చెప్పుకుంటూ సామాన్యులను బెదిరిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే కేతంరెడ్డి సరస్వతమ్మ తన భూమిని ఆక్రమించారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. అయితే భూమిని సర్వే చేసేందుకు వస్తున్న అధికారులను కూడా ఆ వ్యక్తి సర్వేయర్‌లను సర్వేకి రాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ ఆమె జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఆక్రమణకు గురైన తన భూమిని సర్వే చేసి కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేస్తున్నారు.



కేతంరెడ్డి సరస్వతమ్మ పేరుతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకం

ఎంపీ బంధువంటూ బిజిలిగుట్టను చెరబట్టారు

ఎంపీ మాకు బంధువు అవుతాడు, ఎమ్మెల్యే మాకు బాగా తెలుసు అంటూ కొంత మంది రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల మార్గంలో గల సర్వే నెంబరు 853లో గల బిజిలిగుట్టను యంత్రాలతో తవ్వి కబ్జాకు పాల్పడుతున్న సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. బిజిలిగుట్ట వద్ద జర్నలిస్టులతో పాటు మరి కొంతమంది పేదలకు పట్టాలిచ్చారు. అయితే ఇంకా కొంత గుట్ట పొరంపోకు ఉండడంతో కొంత మంది కబ్జారాయుళ్లు అధికార పార్టీని అడ్డుపెట్టుకుని యంత్రాలతో గుట్టను గుల్ల చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అవసరాలకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఉపయోగించాల్సిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టా లేకపోయినా, ఆ భూములతో ఎటువంటి సంబంధం లేని వారు దౌర్జన్యంగా యంత్రాలతో గుట్టను పగలగొట్టి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజిలిగుట్ట వద్ద గుట్టను పగలగొట్టి చదును చేసి ప్లాట్లు వేస్తున్న కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

నగరవనం పేరుతో లాక్కున్నారు

నగరవనం పేరుతో మా భూములు, సమాధులు కూడా లాక్కున్నారని రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామం చెర్లోపల్లె తాండాకు చెందిన నాగమణి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మా తాతల కాలం నుంచి సర్వే నెంబరు-5/2లో మూడు ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ అక్కడే తమ కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోతే సమాధులు వేసుకుంటున్నామని వారు తెలిపారు. అలాగే సర్వే నెంబరు 4/2-2 బుక్కే శంకర్‌నాయక్‌కు చెందిన 94 సెంట్లు, సర్వే నెంబరు 4/1-ఏలో బుక్కే నాగరత్నకు చెందిన మూడు ఎకరాలు, సర్వే నెంబరు 4/1-డీలో ఒక ఎకరా 85 సెంట్లతో పాటు సర్వే నెంబరు 4/2లో రెండు ఎకరాల్లోని సమాధులను కూడా నగరవనం పేరుతో లాక్కున్నారని గిరిజనులు వాపోతున్నారు. తమకు ఇచ్చిన డీకేటీ భూములు లాక్కోవడంతో పాటు సమాధులను కూడా లేకుండా చేశారని, ఇదేమి దౌర్జన్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేరే చోట భూమిని ఇస్తామని చెప్పిన జిల్లా ఉన్నతాధికారులు అసలు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఇదేకాకుండా రాయచోటి చుట్టుపక్కల ఇలాంటి సంఘటనలు ప్రతిరోజూ జరుగుతున్నప్పటికీ అటు అధికార పార్టీ నేతలు గానీ, ఇటు జిల్లా ఉన్నతాధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లా కేంద్రం చుట్టుపక్కల ఉన్న డీకేటీ భూములపై అధికారుల అండదండలతో అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు కన్నేసి కబ్జాలకు పాల్పడుతూ చదును చేసి ప్లాట్లు వేసి కోట్ల రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



బిజిలిగుట్టపై ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) చెర్లోపల్లి తాండాకు చెందిన చావలానాయక్ పేరుతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకం

ఆ విషయాలు నాకు తెలియవు

-రంగస్వామి, ఆర్డీవో

నగరవనం పేరుతో రాయచోటి మండల పరిధిలోని చెర్లోపల్లె తాండాకు చెందిన గిరిజనుల భూములు ప్రభుత్వం తీసుకుని వారికి వేరేచోట పట్టాలు ఇస్తామన్న విషయం నాకు తెలియదు. బిజిలిగుట్ట వద్ద గుట్టను యంత్రాలతో తవ్వి చదును చేసి ప్లాట్లు వేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ప్రేమంతకుమార్, తహసీల్దార్, రాయచోటి

రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. పట్టణ పరిధిలోని బిజిలిగుట్ట సమీపంలో ఆక్రమణలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. దానిపై విచారించి ఆక్రమణలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

గండబోయనపల్లె పాఠశాలకు జాతీయ అవార్డు

- ఢిల్లీలో అవార్డు అందుకున్న గ్రీన్ టీచర్



ఢిల్లీలో అవార్డు స్వీకరిస్తున్న గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్, విద్యార్థులు

వాల్మీకిపురం, జనవరి 30: వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ హరిత పాఠశాల అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా దేశంలోనే ఉత్తమంగా నిలిచినందుకు ల్యాండ్ మేనేజ్‌మెంట్ అవార్డును పాఠశాల గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్, విద్యార్థులు అందుకున్నారు. నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఉన్న స్థలంలో ఆరేళ్ల నుంచి 1.75 ఎకరాలలో మియావాకి మినీ ఫారెస్టును పెంచుతున్నారు. న్యూఢిల్లీలోని లోధి రోడ్‌లోని స్టైయిన్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యునెస్కో ప్రతినిధి నుంచి అవార్డు అందుకున్నారు. దేశంలో 5 కేటగిరీలలో 200 ప్రాజెక్టులను ఎంపిక చేయగా ఇందులో గ్రీన్ టీచర్ కిశోర్ మొదటిస్థానంలో నిలిచి అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం, ఉప విద్యాశాఖాధికారి వరలక్ష్మి, రాష్ట్ర ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల హెచ్‌ఎం రెడ్డిమోహన్, గ్రీన్ టీచర్ కిశోర్‌కుమార్, ఎన్‌జీసీ విద్యార్థులను అభినందించారు.

హోరా హోరీగా...

- నువ్వా.. నేనా అన్నట్లు తలపడుతున్న జట్లు
- ఉత్కంఠగా జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



పోటాపోటీగా తలపడుతున్న తమిళనాడు-తెలంగాణా జట్లు

రాజంపేటటౌన్, జనవరి 30: రాజంపేటలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు నువ్వానేనా అన్న రీతిలో కొనసాగుతున్నాయి. మంగళవారం చండీఘడ్-జార్ఖండ్‌ల మధ్య జరిగిన రసవత్తర పోటీలో చండీఘడ్ 26 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. తమిళనాడు, తెలంగాణా జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో ఇరు జట్లకు 56 పాయింట్లు రావడంతో మ్యాచ్ టై అయ్యింది. గోవా-విద్యాభారతిల మధ్య జరిగిన పోటీలో విద్యాభారతి జట్టు 33 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. చండీఘడ్-హిమాచల్‌ప్రదేశ్‌ల మధ్య పోటీ జరగగా హిమాచల్ ప్రదేశ్ జట్టు 69 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కర్ణాటక-రాజస్థాన్‌ల మధ్య జరిగిన పోటీలో 13 పాయింట్లతో రాజస్థాన్ జట్టు విజయం సాధించింది. ఎన్‌వీఎస్-మహారాష్ట్ర మధ్య జరిగిన పోరులో మహారాష్ట్ర జట్టు 35 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. గుజరాత్-మధ్యప్రదేశ్‌ల మధ్య జరిగిన పోరులో 4 పాయింట్ల తేడాతో గుజరాత్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు పాల్గొని జట్ల సభ్యులను పరిచయం చేసుకున్నారు. డీఎస్పీ చైతన్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, జియాన్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కరస్పాండెంటు రాజారత్నం ఐజాక్, వైష్ణవి స్కూల్ కరస్పాండెంటు పోలా రమణారెడ్డి, డైట్ లెక్చరర్ జయరామ్‌నాయుడు, తిరుపతి డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- 70 కేజీల గంజాయి స్వాధీనం... అదుపులో నిందితులు...?





సండ్రడివిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్లో) స్వాధీనం చేసుకున్న గంజాయి మూటలు

ములకలచెరువు, జనవరి 30: ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీలోని సండ్రడివి అటవీ ప్రాంతం వద్ద మంగళవారం ములకలచెరువు పోలీసులు 70 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు... మూడు కార్లలో అక్రమంగా గంజాయి తీసుకెళుతున్న స్మగ్లర్లు సండ్రడివి అటవీ ప్రాంతంలోని రోడ్డు పక్కన ఆపారు. మూడు వాహనాల్లోని గంజాయిని ఇతర వాహనంలోకి మార్చుతుండగా అటుగా వెళ్లిన ఓ వ్యక్తి వారిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడన్న విషయం తెలియడంతో గంజాయి సంచులు రోడ్డు పక్కనున్న అటవీ ప్రాంతంలో దాచిపెట్టి స్మగ్లర్లు పారిపోయేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల్లో కొందరిని పట్టుకోగా, మరికొందరు పరారైనట్లు తెలిసింది. అలాగే అటవీ ప్రాంతంలో దాచిపెట్టిన ఆరు సంచుల్లోని 70 కేజీల వరకు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పారిపోయిన స్మగ్లర్ల కోసం పోలీసులు సండ్రడివిలో జల్లెడ పట్టారు. దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టారు. పట్టుబడ్డ నిందితుల ఆధారంగా మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గంజాయి ఎక్కడి నుంచి ఎక్కడికి అక్రమ రవాణా చేస్తున్నారో పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చూపి పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

ఇప్పుడే గుర్తొచ్చిందా...?



గుంజన నది ప్రవాహానికి గతంలో ఇళ్లు కూలిపోయింది ఇక్కడే

- ఏడాది క్రితం మంజూరైన గుంజన నది రక్షణ గోడ
- అప్పుడే రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటన
- తర్వాత పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఎన్నికల వేళ భూమి పూజకు సిద్ధం చేసిన అధికారులు
- నేడు పనుల ప్రారంభానికి సన్నాహాలు

రైల్వేకోడూరు, జనవరి 30: సరిగ్గా ఏడాది క్రితం రైల్వేకోడూరు గుంజననదికి రక్షణ గోడ పనుల కోసం రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అనంతరం దాని గురించి పట్టించుకోని వైసీపీ ప్రజాప్రతినిధులు ఎన్నికలు దగ్గర పెట్టుకుని ఆఘమేఘాలపై ఈనెల 31వ తేదీ బుధవారం భూమి పూజ చేయడానికి ఏర్పాట్లు చేశారు. వివరాల్లోకి వెళితే... రైల్వేకోడూరు పట్టణానికి చుట్టూ గుంజన, ముష్టేరు, గుండాలేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. నదుల మధ్యలో రైల్వేకోడూరు ఉంది. రైల్వేకోడూరు అటవీశాఖ ఎర్రచందనం పార్కు సమీపం నుంచి చిట్వేలి బ్రిడ్జి వరకు ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు పొంగి రైల్వేకోడూరులోకి నీరు ప్రవహించి పేదల ఇళ్లు కూలిపోతున్నాయి. రైతుల భూములు కోతకు గురవుతున్నాయి. ఎర్రచందనం పార్కులోని ఎర్రచందనం చెట్లు కొట్టుకుపోతున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. 2005లో కురిసిన భారీ వర్షాలకు సుమారు 30 ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రతి ఏడాది కురిసే వర్షాలకు ఇళ్లు దెబ్బతినడం, నేలమట్టం కావడం జరుగుతోంది. ఎర్రచందనం పార్కు నుంచి చిన్నలాలాపేట, గాండ్లవీధి, ధర్మాపురం, చిట్వేలి రూటులో ఉన్న బ్రిడ్జి వరకు నదీ పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితమే గంజననదికి రక్షణ గోడ మంజూరైతే అప్పుడు నిర్మాణ పనులు చేపట్టకుండా ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నాయని, ప్రజలను తమవైపు మళ్లించుకోవడానికి ప్రజాప్రతినిధులు హడావిడిగా పనులు ప్రారంభం చేస్తున్నారనేది రైల్వేకోడూరులో చర్చనీయాంశంగా మారింది. పెనగలూరు మండలంలో సోమశిల బ్యాక్ వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా ఆగమేఘాల మధ్య భూమి పూజ చేశారు. రూ.250 కోట్ల పనులు ఎన్నికల సమయానికి ఎలా పూర్తి చేస్తారని పలువురు ప్రశ్నించారు. రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామ బ్రిడ్జి పనులకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్ దగ్గర డబ్బులేక, ప్రభుత్వం నుంచి బిల్లులు కాక పనులు అర్థాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. గుంజననదికి రక్షణ గోడ ఎన్నికల లోపు పూర్తి చేసేంత సమయం ఎక్కడ ఉందని పలువురు అంటున్నారు. ఏడాది క్రితమే పనులు ప్రారంభించి ఉంటే ఈ ఏడాది పూర్తి దశకు చేరుకుని ఉండేవని, ఎన్నికల వేళ భూమి పూజ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పనులకు అన్ని రకాల అనుమతులు వచ్చాయి

పనులకు అన్ని రకాల అనుమతులు వచ్చాయని రైల్వేకోడూరు ఇరిగేషన్ శాఖ ఏఈ రాజన్న తెలిపారు. ఏడాది క్రితం సుమారు రూ.30 కోట్లు మంజూరైంది. 2.5 కిలోమీటర్ల దూరం వరకు రక్షణ గోడ నిర్మాణం పనుల కోసం ఈనెల 31న రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఎంపీ మిధున్‌రెడ్డిలు భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, భూమి పూజ కోసం అన్నీ సిద్ధం చేస్తున్నామని వివరించారు.



రక్షణ గోడ భూమి పూజకు సిద్ధం చేస్తున్న శిలాఫలకం

నిడిజువ్విలో రజనీకాంత్



షూటింగ్‌లో పాల్గొన్న రజనీకాంత్

ఎర్రగుంట్ల, జనవరి 30: తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ మంగళవారం నిడుజువ్వి గనుల్లో జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు. రెండు రోజులుగా ఇక్కడి గనుల్లో రజనీకాంత్ నటిస్తున్న చిత్ర యూనిట్ షూటింగ్ ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రగుంట్లకు చెందిన సానేపల్లి మధుసూధన్‌రెడ్డికి చెందిన నాపరాయి గనిలో రెండు రోజులపాటు షూటింగ్ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జరిగిన షూటింగ్‌లో రజనీకాంత్ పాల్గొని తిరిగి గెస్ట్‌హౌస్‌కు వెళ్లిపోయారు. బుధవారం సాయంత్రం వరకు ఇక్కడ షూటింగ్ జరుగుతుందని సమాచారం. అయితే షూటింగ్ సమయంలో ఆప్రాంతంలో ఎవ్వరిని అనుమతించడం లేదు. స్థానిక పోలీసులతోపాటు ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది అక్కడికి ఎవ్వరినీ రానీయకుండా చర్యలు చేపట్టారు. రజనీకాంత్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులకు నిరాశే మిగిలింది. కొద్దిసేపు షూటింగ్‌లో పాల్గొన్న వెంటనే రజనీ తన చాంబర్‌లోకి వెళ్లిపోవడంతో అభిమానులు దూరం నుంచే సెల్‌కెమెరాలతో ఫొటోలు తీసుకుని సంతోషపడ్డారు. రజనీ షూటింగ్ సందర్భంగా గనుల్లో కోలాహం నెలకొంది.

రైలుకింద పడి వ్యక్తి మృతి

సిద్దవటం, జనవరి 30 : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామానికి చెందిన రెడ్డయ్య అనే వ్యక్తి భాకరాపేట వద్ద రైలు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శరీరం రెండు ముక్కలు కావడంతో మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

రంగసముద్రంలో చోరీ

3.70 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు, బైక్ అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పోరుమామిళ్ల, జనవరి 30 : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం గ్రామంలో చరణ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి సుమారు రూ.3.70 లక్షల విలువైన బంగారు, వెండి నగలు నగదు, మోటారు బైక్‌ను తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. చరణ్‌రెడ్డి మైదుకూరు రోడ్డులో డాబాలో ఉన్నాడని డాబా మూసిన తరువాత ఇంటికి వెళ్లి చూడగా తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు సీఐ చిరంజీవి, ఎస్ఐ సంఘటాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల, జనవరి 30 : సాదిక్ ఆలియాస్ సన అనే హిజ్రాపై దాడి చేసి గాయపరిచిన కేసులో రెడ్డివారిపల్లెకు చెందిన మలతాటి రవి, వరికుంట్లకు చెందని నిఖిల్, మహబూబ్‌నగర్‌కు చెందిన గోపిక్రిష్ణ ఆలియాస్ గోపికలను అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు సీఐ చిరంజీవి తెలిపారు. ఈనెల 25న సన అనే హిజ్రాపై దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ కేసులో సీఐ చిరంజీవి పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం బద్వేలు కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

అక్రమ మద్యంపై పోలీసుల మెరుపుదాడులు


పట్టుబడిన వ్యక్తితో పాటు మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 30 : నగర పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద రైల్వే పోలీసులు సోదాలు నిర్వహిస్తుండగా చెన్నై నుంచి పూణె వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి బ్యాగ్‌లో ఉన్న మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఇన్స్‌పెక్టరు నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు... గుంతకల్లు డివిజన్ ఎస్‌ఆర్‌పీ చౌడేశ్వరిదేవి, తిరుపతి డీఎస్‌ఆర్‌పీ షేక్షా ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. చెన్నై నుంచి పూణె వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి వద్ద బ్యాగులో 22 మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా పట్టుకుని సీజ్ చేయడంతో పాటు ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెపాఆరు. దాడిలో పాల్గొన్న సిబ్బందిని ఎస్‌ఆర్‌పీ, డీఎస్‌ఆర్‌పీలు అభినందించడం జరిగిందని ఆయన తెలిపారు.

సంబేపల్లెలో 40 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లు, వ్యక్తితో పోలీసు సిబ్బంది

సంబేపల్లె, జనవరి 30: మండల పరిధిలోని శెట్టిపల్లెకు చెందిన షఫీ మంగళవారం అక్రమ మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నం

- భూ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, జనవరి 30: దేశంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ పేరుతో ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వ రయ్య విమర్శించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా నడవాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్, సీబీఐ, సీఐడీ లాంటి వాటిని కూడా వాడుకుని విపక్షాలపైన దాడులు చేయించి వారిని లొంగదీసుకోవడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీలపైన, ప్రశ్నించిన వారిపై వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడే నీచమైన రాజకీయాలకు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ మానుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరారు. సస్పెండ్ అయిన కలెక్టర్ గిరీషా జిల్లాలో, రాయచోటి పరిసర ప్రాంతాల్లో భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, రాధాకృష్ణ, విశ్వనాథ్‌నాయక్, శ్రీనివాసులు, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఉదయగిరి రూరల్, జనవరి 30: నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలోని ఓ లాడ్జీలో మంగళవారం యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు, అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కంబాలకుంట గ్రామానికి చెందిన సింగనమల వెంకటేశ్ (23)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో ఉదయగిరి చాకలవీధిలోని తన అక్క సైదాపురం నాగమణి వద్దకు వచ్చి ఉంటున్నాడు. ఐదేళ్లుగా మర్రిపాడు మండలం రామానాయుడుపల్లికి చెందిన మేస్త్రీ చీమలదిన్నె రమణయ్య వెంట తెలంగాణలో బేల్దారీ పనులకు వెళుతుండేవాడు. ఈ క్రమంలో వెంకటేశ్ సంక్రాంతికి మేస్త్రీతో పాటు ఉదయగిరికి వచ్చాడు. ఈనెల 14న రమణయ్య లాడ్జీలో ఓ గదిని అద్దెకు తీసుకుని తెలంగాణకు కూలీలను తీసుకెళ్లేందుకు గ్రామాల్లో తిరుగుతున్నాడు. నాలుగు రోజుల క్రితం తన అక్క ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేశ్ మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఈ విషయం మేస్త్రీకి తెలపడంతో మళ్లీ ఎక్కడికైనా వెళ్లిపోతాడేమోనని గ్రహించి మేస్త్రీ, నాగమణి కుమారుడు కలిసి వెంకటేశ్‌ను తీసుకువచ్చి లాడ్జీలో ఉంచి బయట తాళం వేసి, టీ తాగేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వేల్పుల గిరిబాబు తన సిబ్బందితో లాడ్జీకి చేరుకుని తలుపులను ధ్వంసం చేసి మృతదేహాన్ని కిందకు దింపి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

నరక దారి...!

- నిత్యం ప్రమాదాలే.. అయినా పట్టించుకోరు
- అనుమతులు లేక ఆగిన రోడ్డు పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- రాయచోటి-పింఛా రోడ్డు దుస్థితి



సుండుపల్లె, జనవరి 30: ఆ దారిలో ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. అది నరకానికి ప్రధాన రహదారిగా మారింది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. పింఛా నుంచి రాయచోటికి వెళ్లే ప్రధాన రహదారి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. సుండుపల్లె మండల ప్రజలకు ఉన్న ప్రధాన సమస్యల్లో మొదటిది డబుల్ రోడ్డు సమస్య. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు ప్రయాణం చేసే ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ఇంత దారుణంగా ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. రాయచోటి నుంచి కొంతమేరకు జీకే రాచపల్లె వరకు డబుల్ రోడ్డుకు అనుమతులు వచ్చాయి. కొంతవరకు పనులు జరిగాయి. అటవీ మార్గంలో అనుంపల్లె నుంచి రాచంవాండ్లపల్లె వరకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా గుంతలమయంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు పక్కకు దిగాలంటే భయపడిపోతున్నారు. ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం రాయవరంకు చెందిన షాజహాన్ అనే వ్యక్తి రాయచోటిలో నివాసం ఉంటూ తన స్వగ్రామమైన రాయవరం వెళ్లి తిరిగి రాయచోటికి వెళుతూ ప్రమాదానికి గురై తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురై గాయాలు కావడంతో పాటు మృతి చెందిన వారు ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించాలని లేకుంటే రోడ్డు పక్కన మట్టి తోలి తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అటవీ ప్రాంతంలో అనుమతులు లేక...

రూ.35 కోట్ల నిధులతో రాయచోటి సమీపంలోని సద్దికూళ్లవంక నుంచి సుండుపల్లె మండలంలోని జీకే రాచపల్లె వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. 20 కిలోమీటర్లు డబుల్ రోడ్డుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి పనులు జరుగుతున్నాయి. అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన అనుంపల్లె అడవిలో పనులు జరగడం లేదు. పనులు ఆగిపోవడం వలన రోడ్డు గుంతలమయంగా మారి గతంలో కురిసిన వర్షాల కారణంగా రోడ్డుకు ఇరువైపులా రోడ్డు కోతకు గురి కావడం గుంతలు పడడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కనీసం మట్టిని తీసి గుంతల్లో వేసేందుకు సైతం అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు వాపోతున్నారు.

అనుమతి రాగానే పనులు పూర్తి చేస్తాం

- గిరీశ్వర్‌రావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేసేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తాం. అటవీ ప్రాంతంలో గుంతల్లో మట్టి వేయాలన్నా అటవీశాఖ అధికారులు వేయనివ్వడం లేదు. అనుమతులు వచ్చేంతవరకు చేసేదానికి లేదంటున్నారు. అనుమతులు కోసం ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. త్వరితగతిన పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తాము.

పింఛా వరకు డబుల్ రోడ్డు వేయాలి



పింఛా నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఎప్పుడో వేసిన రోడ్డు గుంతలమయంగా మారింది. పింఛా రోడ్డులో సుమారు 80 పల్లెలకు చెందిన ప్రజలు అనేక అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వెళుతుంటారు. గుంతలమయంగా మారిన రోడ్డులో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం వలన సమాయానికి బస్సులు, ఆటోలు కూడా రావు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పింఛా వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలి.

- సుధాకర్, పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కొడుకులను కోల్పోయాను



మడితాడు సమీపంలో మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నా ఇద్దరు కొడుకులను కోల్పోయాను. రాయవరం నుంచి సుండుపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మడితాడు సమీపంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. అక్కడ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకేసారి ఇద్దరు కుమారులు చనిపోయారు. మా కుటుంబం రోడ్డు పాలైంది. సరైన రోడ్డు వసతి ఉండి ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదు. నాలాగే ఇంకెంతమంది కుటుంబాలు ఈ రోడ్డు బారిన పడి అయినవారిని కోల్పోయారో. వెంటనే అధికారులు స్పందించి రాయవరానికి డబుల్ రోడ్డు మంజూరు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

-ఫహరున్, రాయవరం

బాలాయపల్లెలో సచివాలయాన్ని ప్రారంభించిన కలెక్టరు


మాట్లాడుతున్న కలెక్టరు విజయరామరాజు

బద్వేలు రూరల్, జనవరి 30 : మండల పరిధిలోని బాలాయపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కలెక్టరు విజయరామరాజు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రతి లబ్ధిదారుడు నేరుగా ప్రభుత్వం వద్ద నుంచి లభించే అన్ని సదుపాయాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, జడ్పీటీసీ పోలిరెడ్డి, ఎంపీపీ రమణమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, డీఈ నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బద్వేలు రూరల్, జనవరి 30 : మండల పరిధిలోని తిరువెంగలాపురం గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై రవికుమార్ తెలిపారు.

వ్యాధుల అధ్యయనంపై వైవీయూలో సదస్సు

- బ్రోచర్ విడుదల చేసిన వీసీ చింతా సుధాకర్


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైస్‌ఛాన్సలర్, ప్రిన్సిపాల్, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 30 : వైవీయూ జంతుశాస్త్ర శాఖ ఫిబ్రవరి 6, 7 తేదీల్లో మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై నిర్వహించే సెమినార్ ప్రయోజనకరమని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం తన ఛాంబరులో సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జంతు నమూనాలు, వైద్య పరిశోధనల, ఔషధ అభివృద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే మానవుడిలో వ్యాధుల గుర్తింపునకు సహాయపడతాయన్నారు. ప్రతియేటా ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల కొద్దీ జంతువులపై ప్రయోగాలు చేస్తున్నారని, ఆ సమయంలో జంతువులు అనుభవించే నొప్పి, బాధ మరణం చర్చనీయాంశంగా మారిందన్నారు. పరిశోధనల్లో ప్రత్యామ్నాయ పద్ధతులను వినియోగించే విషయమై నిపుణులు ప్రసంగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో దూర విద్య సంచాలకులు ప్రొఫెసర్ కె.క్రిష్ణారెడ్డి, ఉప సంచాలకులు శ్రీధర్‌బాబు, సెమినార్ నిర్వహణ సంఘ సభ్యులు ఎస్.వెంకటరమణ, అనుప్రసన్న, వెంకటరమణారెడ్డి, మరియదాస్, మనస్వి పాల్గొన్నారు.

పుట్టా సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీలో చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, జనవరి 30 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీలోని బోగాదిపల్లె, చీకటివారిపల్లె, గొల్లపల్లె గ్రామాల్లోని ప్రజలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో వైసీపీ నుంచి నల్లబాపినేని ఓబయ్య, ప్రతాప్, గంగినాయుడు, బాలయ్య, వంకర సుబ్బయ్య, సుబ్రమణ్యం, ప్రతాప్, వెంకటేశ్, రామసుబ్బయ్య, సుబ్రమణ్యంతో పాటు మూడు గ్రామాల్లోని అనుచరులు 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు, సీనియర్ నాయకుడు రామచంద్రనాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి, ఎం.రామచంద్రనాయుడు, పుట్టా ప్రభాకర్‌యాదవ్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు వెంకటేశ్‌నాయుడు, ముద్దుక్రిష్ణమనాయుడు, సర్పంచ్ నారాయణ, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, బీమానాయుడు, రమేష్, వెంకటేశ్‌నాయుడు, కొండా ఓబయ్య, మాజీ ఎంపీపీ సుబ్బారావు, భూతప్పనాయుడు, శీలం నరసింహులు, నాగచంద్రుడు, జయరామిరెడ్డి, శివ, మిల్లుశ్రీను, అన్నవరం సుధాకర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతదేహానికి చీమలు పట్టినా పట్టించుకోరా...

- ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల బైఠాయింపు
- సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్


ఆసుపత్రి వద్ద గుంపులుగా చేరిన మృతురాలి బంధువులు


ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 30 : జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని బాధితులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే... జమ్మలమడుగు బీసీ కాలనీకి చెందిన చేనేత కార్మికురాలు బడిగింజల దేవి (16) అనే బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. సోమవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మార్చురీకి తరలించారు. విచారణ పేరుతో పోలీసులు సాయంత్రం వరకు మృతదేహాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రభుత్వ వైద్యులు గానీ సిబ్బందిగానీ మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టకుండా అలాగే వదిలేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు బాధితురాలి బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి మార్చురీ వద్దకు చేరుకున్నారు. మార్చురీలో బాలిక మృతదేహానికి చీమలు పట్టి ఉండటం గమనించిన కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహం ఫ్రీజర్‌లో పెట్టకుండా ఇలా రోజంతా నిర్లక్ష్యంగా వదిలేయడంపై ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని తెలపడంతో నిరసనగా ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. పోస్టుమార్టం సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపించారు. బాధ్యులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్‌బాషాకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ పోస్టుమార్టం వద్ద నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉపాధి కల్పనకు వృత్తి విద్య దోహదం

రామాపురం, జనవరి 30: ఉపాధి కల్పనకు వృత్తి విద్య ఎంతో దోహ దపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కేయండీ అఫ్రోచ్‌బేగం అన్నారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం 8, 9, 10, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం బాలికలకు బ్యూటీ అండ్ వెల్నెస్ శిక్షణ కల్పించారు. వృత్తి విద్య ఉపాధ్యాయురాలు సురేఖ బాలికలకు అవగాహన కల్పించారు. మెహందీ ఫేస్ వాష్ మేకప్ ఎలా చేయాలి అని చూపించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృత్తి విద్య నేర్చుకోవడం వల్ల చదువుతో పాటు ఉపాధి కల్పన మనతో పాటు ఇత రులకు జీవనోపాధి కల్పించవచ్చునన్నారు.

వ్యవసాయ కూలీలు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20లక్షలు ఇవ్వాలి

రైల్వేకోడూరు, జనవరి 30: వ్యవసాయ కూలీలు పనులు చేసే సమయంలో ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుం బానికి జీవిత భీమా ద్వారా రూ.20 లక్షలు ప్రభుత్వమే చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కువగా వ్యవసాయ కూలీలు పని పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు చనిపో తున్నారని.. వీరికి ప్రభుత్వం లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఐ నాయకులు, రేవూరి శంకరయ్య, చలంపాటి నరసింహులు తదిత రులు పాల్గొన్నారు.

క్రీడా స్థలాన్ని పరిశీలించిన ఈఈ

రామాపురం, జనవరి 30: మండల పరిధిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో క్రీడా స్థలాన్ని మంగళవారం సమగ్ర శిక్ష టీం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు క్రీడా మైదానం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి శ్రీపథకం కింద నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం లక్ష రూపాయలు మంజూరైందని, మిగిలిన మొత్తం అంచనా ప్రకారం విడుదల చేస్తారన్నారు. మైదానంలో బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కాగా పాఠశాలకు క్రీడా మైదానం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రిన్సిపాల్ ఎస్‌కేఎండీ అఫ్రోచ్‌బేగం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 30: లక్కిరెడ్డిపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ విజయ తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యా ర్థులు ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవ చ్చున్నారు. అలాగే 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 25 నుంచి ఫిబ్రవరి 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మార్చి 10వ తేదీ గురు కుల పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశం ఉంటుం దన్నారు. వివరాలకు 7904550132-9440590697 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

సంబేపల్లెలో...

సంబేపల్లె, జనవరి 30: దేవపట్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకళాదేవి కోరారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, 5వ తరగతి ప్రవేశం కొరకు ఫిబ్రవరి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. రాత పరీక్ష మార్చి 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 5వ తరగతి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు జిల్లా పరిధిలోని పాఠశా లలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించనవసరం లేదన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నందలూరు, జనవరి 30: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10గంటలకు సాధా రణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సౌభాగ్యమ్మ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ మండలంలోని అధికారులు, మండల, జిల్లా ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు వారి గుర్తింపు కార్డులు, ఆయా శాఖల నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు.

యువఫొటోగ్రాఫర్ ఆత్మహత్య


నూర్ అలీ (ఫైల్)

పీలేరు, జనవరి 30: వ్యాపార విస్తరణ, నిర్వ హణ కోసం చేసిన అప్పుల బాధ తాళలేక పీలేరు పట్టణం సదుం రోడ్డుకు చెందిన యువఫొటోగ్రాఫర్ నూర్ అలీ(29) ఆత్మహత్య చేసు కున్నాడు. గత కొంత కాలంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్న అతను మంగళవారం సాయంత్రం తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలు సుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు అతనిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు గాంధీ చిత్రపటానికి పూలమా ల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస మార్గం లో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానాయకుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమ ణ్యంనాయుడు, టీడీపీ నేతలు సతీష్‌రాజు, సుబ్బరాజు, పాండురాజు, టీఎన్ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధం తి సందర్భంగా మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు కొమ్మా శివ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ దేశ స్వరాజ్యం కోసం అలు పెరగకుండా ఉద్యమాలు చేశారని కొనియా డారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పోకల మణి, దళిత నాయకులు పుల్లెల రమేష్‌బాబు, తేనేపల్లి చిన్నా, నాయకులు టీడీపీ బాషా, పోతురాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వీరబల్లి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులు అర్పించడం జరిగింది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. సీనియర్ నాయ కులు రాంమోహన్‌రెడ్డి, నాగసుబ్బయ్య నాయుడు, జయచంద్రారెడ్డి, మహిళా కమిటీ అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని కూడలి వద్ద మహాత్మాగాంధీ చిత్రప టానికి పూలమాలలు వేసి మౌనం పాటిం చారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్రం కోసం పోరాడిన మహానుభావులను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. టీడీపీ పార్లమెంట్ వాణి జ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, జనసేన నాయకులు రామశ్రీనివాస్, టీడీపీ గ్రామ అధ్యక్షులు సుబ్బరామ్, మాజీ గ్రామ అధ్యక్షులు చెన్నంశెట్టి వెంకట్రమణ, టీడీపీ నాయకులు, దళిత నాయకులు వీరనా గయ్య, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలు చంద్రబాబు వెంటే

● *టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు*


సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా.. ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారని టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంప పెట్టు అన్నారు. అధికార గర్వంతో పెట్టిన కేసులు తప్పుడువి అని సుప్రీం కోర్టు తీర్పుతో వెల్లడైందన్నారు. చంద్ర బాబుపై అక్రమ కేసులు పెట్టి వాటిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకో వాలని చూసిన సీఎం కథ అడ్డం తిరిగిందన్నారు. నిజం గెలవడానికి ఆల స్యం కావచ్చు కానీ ఖచ్చితంగా నిజమే గెలుస్తుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగాలన్నారు. చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని వైసీపీ వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిం దన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతుందన్నారు. ఏపీ సీఎం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్రబాబు వెంటే ప్రజలు ఉన్నారన్నారు. వైసీపీ పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. వైసీపీలో సీఎం తన ఆధిపత్యం కాపాడుకోవాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, టీడీపీ నాయకులు కేజేపీ రెడ్డయ్యనాయుడు, ప్రభాకర్‌నాయుడు, విజయేంద్రవర్మ, రాజ, గడికోట సుబ్బరాయుడు, దళిత నాయకులు రమేష్‌బాబు, మహిళా నాయకురాలు మేహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలు


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

చిట్వేలి, జనవరి 30: ఉపాధి పనుల్లో అలసత్వం, జవాబుదారీతనం లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఉపాధి పీడీ మద్దిలేటి పేర్కొన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ మేరకు మంగళవారం చిట్వేలి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి హామీ 18వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవీఓ ఆకాష్, ఎంపీపీ చంద్రతో కలిసి పాల్గొన్నారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల తీరును పరిశీలించారు. పనుల్లో అలసత్వం, జవాబుదారి తనం లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. 3 సంవత్సరాలుగా కూలి రాలేదన్న ఆరో పణపై తీవ్రంగా స్పందించి వారం రోజుల్లో డబ్బులు కూలీకి జమచేయాలని ఆదేశించారు. పోల్లోపల్లి ఉపాధి హామీ పనులపై నిరసన వ్యక్తం చేయగా ఆర్డీవో విచారణ సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెవ్వ శ్రీనివాసులరెడ్డి, ఎల్.వి.మోహన్ రెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, విజయభాస్కర్, ఎంపీడీవో, తిమ్మాయపాలెం సర్పంచ్ తుపాకుల బాలు పాల్గొన్నారు.

ఆర్థిక విద్యా సంబంధ సమస్యలు పరిష్కరించండి


డీఆర్‌వోకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 30: ఆర్థిక విద్యాసంబంధ సమస్యలతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను నెరవేర్చాలని బహుజన టీచర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌వో సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర మాట్లాడుతూ జనవరి 21 లోపు అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల వివిధ సమస్యలు పరి ష్కరించాలని కోరారు. ప్రభుత్వం జెడ్పీ పీఎఫ్ లోన్లను, సంపాదిత సెలవుల నగదును కొంత మందికి మాత్రమే మంజూరు చేసిందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి 4500 కోట్లు బకాయిలు పడ్డారని ఏపీజీఎల్ఐ సర్వీసు లను నిలుపుదల చేశారన్నారు. 330 కోట్ల ఏపీజీఎల్ఐ లోన్లు త్వరగా మంజూరు చేయాలని, ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న 1000 కోట్లకుపైగా పీఎఫ్ లోన్లను ఫైనల్ పేమెంట్లను వెంటనే మంజూరు చేయాలని తదితర డిమాండ్ చేశారు. బహుజన టీచర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రాయచోటి రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, జిల్లా గౌరవా ధ్యక్షుడు మయాన హబీబుల్లాఖాన్, జాయింట్ సెక్రటరీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట పట్టణ ఎస్ఐగా వెంకటేశ్వర్లు



రాజంపేట టౌన్, జనవరి 30: రాజంపేట పట్టణ ఎస్ఐగా ఏ.వెంక టేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. రైల్వేకోడూరు నుంచి బది లీపై ఆయన రాజంపేటకు వచ్చారు. గతంలో ఆయన రైల్వే కోడూరు, ఓబులవారి పల్లె మండలాల్లో పనిచే శారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజం పేటలో శాంతిభద్రతల పర్యవేక్షణను పకడ్బందీగా అమలు పరుస్తానని తెలిపారు.

ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

వీరబల్లి, జనవరి 30: మండల పరిధిలోని పెద్దివీడు రెడ్డివారిపల్లె హైస్కూల్‌లో మంగళవారం జనసైనికులు నల్లన్నగారికిశోర్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, స్కేల్స్, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే మిగతా తరగతుల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసైని కులు నాగేంద్ర, అనీల్, రఘు, గుగ్గిళ్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల తగాదాలు రాష్ట్రానికి అవసరం లేదు

● *బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు*

నందలూరు, జనవరి30 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిలారెడ్డి, ముఖ్యమంత్రి జగన్ తగాదాలు రాష్ట్రానికి అవసరం లేదని బీజేపీ రాష్ట్ర కార్య దర్శి నాగోతు రమేష్ నాయుడు పేర్కొన్నారు. నందలూరు రైల్వేకేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ గొడవలను భారతీయ జనతా పార్టీపై రుద్దే ప్రయత్నాలను మానుకోవాలని షర్మిలారెడ్డికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి చేసిన ద్రోహానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి వచ్చినా ఆ పార్టీని కాపాడ లేడన్నారు. జగన్ ఓటమి ఖరారు అయ్యిందని... ఆ విషయం ఈ మధ్య తిరు పతిలో జరిగిన విద్యా సదస్సులో ముఖ్యమంత్రి మాటల్లోనే స్పష్టమైందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రకటించిన అభ్యర్థులు మిడిల్ డ్రాప్ చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రజాక్షేత్రంలో వేగవంతంగా దూసుకుపోతుందని, రాష్ట్ర నాయకురాలు పురందే శ్వరి నేతృత్వంలో త్వరలో పోరుయాత్ర చేపడతామన్నారు. అనంతరం శ్రీరామ్ ప్రజా వైద్యశాల వద్ద గాంధీ విగ్రహా నికి ఘనంగా నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు పోతురాజు మస్తా నయ్య, బీజేపీ నాయకులు కోడూరు ఆదినారాయణ, రమణ, విఠలాచార్య, శ్రీను, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన గెలుపు చారిత్రాత్మకం కావాలి

సుండుపల్లె, జనవరి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపు చారి త్రాత్మకం కావాలని జనసేన నాయకులు ఒంటేరు రాజా, చింతల రామకృష్ణలు తెలిపారు. మంగళవారం జనసేన రాజంపేట నియోజకవర్గనేత ఎల్లటూరి శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో రాయవరం గ్రామ పంచాయతీలోని మిట్టమీదపల్లె, రాయవరం, రాయవరం హరిజన వాడలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రజలను నియంత పాలన నుంచి కాపాడేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ఒక్కటయ్యారని వారు కరపత్రాలు అందించి తెలియపరిచారు. మండలంలోని భాగంపల్లి, నీలంవాండ్లపల్లె, కుప్పగుట్ట, దిన్నెమీద బలిజపల్లెల్లో పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని జనసేన రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకట్రమణ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జనసేన నాయ కురాలు సుగుణమ్మ తెలిపారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం అన్నారు.

అనంతరాజుపేటలో మెగా ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

రైల్వేకోడూరు (రూరల్) జనవరి 30: మండలంలోని అనంతరాజుపేటలో మం గళవారం స్టూడెంట్ యూనియన్ ఫోర్స్ వ్యవస్థాపకుడు బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా 400 మందికి వైద్య సేవలు అందించారు. కరు ణామయి ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన వైద్యులు వ్యాధిని బట్టి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులందరికి ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. అంగన్వాడీ, స్కూలు పిల్లలకు బ్రెష్, పేస్టులు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం, జనవరి 30 : గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించా లంటూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని జంగాలపల్లె గ్రామ పంచాయతీ కమ్మపాలెం ఎస్సీ కాలనీలో గత రెండేళ్లుగా తాగడానికి కొళాయిల్లో మంచినీళ్లు రావడం లేదని.. సోలార్ సిస్టం చెడిపోవడంతో ట్యాంక్‌లోకి నీటి సరఫరా చేయడం లేదని చెబు తున్నారు. దీంతో రైతుల పంట పొలాల దగ్గరికి వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి నెల కొందని.. ఓట్ల కోసం వచ్చే నాయకులు ఎక్కడున్నారని వారు ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారం చేయని ప్రభుత్వాలు ఎందుకని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రిపూట కాలనీలో విద్యుత్ దీపాలు కూడా లేవని కటిక చీకట్లో జీవనం సాగిస్తున్నామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈవిషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు వివరణ కోరగా.. కమ్మపాలెం ఎస్సీ కాలనీలో పైపులైను లేదని.. నూతనంగా పైపులైను ఏర్పాటు చేయాలని పంచాయతీ సర్పంచ్‌లకు తెలిపామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

మందులతో కుష్ఠువ్యాధి నయం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శైలజ

రైల్వేకోడూరు, జనవరి 30: కుష్ఠు వ్యాధిని మందులతో నయం చేసు కోవచ్చు అని జిల్లా అదనపు వైద్యా ధికారిణి శైలజ తెలిపారు. మంగళ వారం శెట్టిగుంట పంచాయితీ పరిధి జ్యోతికాలనీలో కుష్ఠువ్యాధిపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠువ్యాధికి మంచి మందులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రోగులకు అవసరమైన బ్యాండేజి తదితరాలను ఇస్తుందన్నారు. అనంతరం 39 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఎంసీఆర్ చెప్పులు, డీపీఎం ద్వారా బ్రెడ్, అల్సర్ కిట్స్‌ను మురగన్ స్వీట్స్ అధినేత గోపీనాథ్ ద్వారా 150 మందికి పంపిణీ చేశారు. శెట్టింగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సందీప్, రాజంపేట డీఎల్‌టీ మెడి కల్ ఆఫీసర్ రవికుమార్, ఫిజియోథెరపీ డాక్టర్ గురప్ప, డీపీఎంవోలు శంభుప్రసాద్, వేణుగోపాల్, సూపర్‌వైజర్ బాలక్రిష్ణంరాజు, హెల్త్ అసిస్టెంట్ శివశంకర్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం


త్యాగరాజస్వామి చిత్రపటంతో గ్రామోత్సవం

చిట్వేలి, జనవరి 30: పాత చిట్వేలిలో వెలసిన త్యాగరాజస్వామి ఆల యంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించారు. నాయీబ్రాహ్మణ యువత ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నుంచి మేళతాళాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య త్యాగరాజస్వామి చిత్రపటాన్ని గ్రామో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదస్వరం, డోలు కళాకారులు నిర్వహించిన మేళం అందరినీ ఆకర్షించింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాయీబ్రాహ్మణసేవా సంఘం సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సైన్స్ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 30: సైన్స్ ద్వారా పిల్లల్లో జ్ఞానా న్ని పెంపొందిం చుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సి పల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. డిసెంబ ర్‌లో జాతీయ స్థాయి సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. పోటీ పరీ క్షల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని 9 మంది ప్రతిభ కనపరిచారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు గోల్డుమెడల్, ప్రశంశా పత్రాలు ప్రిన్సిపాల్ అందజేశారు. అలాగే ఏకలవ్య ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో జనవరి మొదటి వారంలో నిర్వహించిన రంగోళి, పొంగల్ కార్యక్రమంలో భాగంగా ఏపీ మోడల్ స్కూల్, డాక్టర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 10వ తరగతి విద్యార్థులు మంచి ముగ్గులు వేసి కళాత్మకను చూపారు. మంచి ముగ్గులు వేసి విద్యార్థులకు వెలుగు గురుకుల పాఠ శాల ప్రిన్సిపాల్ విజయ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివశంకర్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సేవలకు గుర్తింపు


చిన్నరెడ్డెయ్యకు సైకిల్ సింబల్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి

సంబేపల్లె, జనవరి 30: రాయచోటి నియోజకవర్గంలో మన టీడీపీ యాప్ ద్వారా రాష్ట్రంలో జరుగు తున్న అవినీతి, అక్రమాలు, అరాచ కాలు ప్రజలకు చేరవేస్తూ చిన్న రెడ్డెయ్యయాదవ్ అహర్నిశలు పనిచే శారని నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కు మార్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మన టీడీపీ యాప్‌లో చురుగ్గా పనిచేసిన సంబేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్య యాదవ్‌ను టీడీపీ కేంద్ర కార్యాలయం గుర్తించి పార్టీ సింబల్ సైకిల్‌ను బహుమతిగా పంపిందని తెలిపారు. తన సేవలను పార్టీ గుర్తించినందుకు పార్టీ కోసం మరింత ఉత్సాహంతో పనిచేస్తామని చిన్న రెడ్డయ్య తెలిపారు. ఇన్‌చార్జి రమేశ్‌రెడ్డి చేతుల మీదు గా సైకిల్ సింబల్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

కిట్లు ఇవ్వకపోతే ఎలా ఆడాలి

● *ఆడుదాం ఆంధ్ర టోర్నీ విజేతల ఆవేదన*

సుండుపల్లె, జనవరి30: ఆడుదాం-ఆంధ్ర టోర్నీలో బాల్‌బ్యాడ్మింటన్ ఆటలో గెలిచినా కూడా కిట్లు ఇవ్వడం లేదని నియోజకవర్గస్థాయి విజేతలు అబ్దుల్, అఫ్జల్‌లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మూడు స్థాయిల్లో విజేతలుగా నిలిచాము. గ్రామ స్థాయిలో ఆడేటప్పుడు క్వాలిటీ లేని కిట్లు ఇచ్చారు. ఆ తరువాత మండలస్థాయి, నియోజకవర్గ స్థాయిలో ఇవ్వా ల్సిన కిట్లను ఇవ్వలేదు. ఇప్పుడు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనాలి. ఈ నెల 31వ తేదీ అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో క్రీడలు జరుగుతాయి. ఇప్పటి వరకు కిట్లు ఇవ్వలేదు. మా సొంత సామాగ్రితో ఆడుతున్నాము. కిట్లు ఇవ్వనప్పుడు ఆటలు ఎందుకు జరిపించాలని మంగళవారం సుండుపల్లెలో ఆవేదనను వ్యక్తం చేశారు. నియోజకవర్గ స్థాయిలో గెలిచిన ప్రైజ్ నగదును కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. అకౌంట్‌లో జమ చేస్తామని చెబుతున్నారన్నారు.

వైఎస్సార్ ఆసరా కిట్ పంపిణీ

పుల్లంపేట, జనవరి 30: మండలానికి నాల్గవ విడతగా వైఎస్సార్ ఆసరా కింద మంజూరైన రూ.4.18 కోట్ల రూపాయల చెక్కును మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు డ్వాక్రా మహిళలకు అందజేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్ర మానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు విడతలుగా 483 స్వయం సహాయక సంఘాలకు 17కోట్ల రూపాయల వైఎస్సార్ ఆసరా నిధులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. వైసీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీని వాసులురెడ్డి, తహశీల్దారు నరసింహకుమార్, ఎంపీడీవో రఘురాం పాల్గొన్నారు.

కల్లూరు టీచరుకు హరిత పాఠశాల అవార్డు



కల్లూరు, జనవరి 30: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు మూడోసారి జాతీయస్థాయిలో హరిత పాఠశాల అవార్డు లభించింది. ఈ అవార్డును మంగళవారం ఢిల్లీలో ఇండియా హాబిటట్ సెంటర్‌లో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ చేతుల మీదుగా ఉపాధ్యాయుడు, ఎన్జీసీ గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు అవార్డును అందుకున్నారు.

చిన్న పనులూ చేయలేకపోతున్నాం

● పంచాయతీ నిధులు దారి మళ్లిస్తున్నారంటూ సర్పంచుల నిరవధిక దీక్ష



చిత్తూరు, జనవరి 30: గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేయడానికి కూడా నిధుల్లేకుండా అల్లాడే పరిస్థితి నెలకొందని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు అన్నారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం సర్పంచులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహారదీక్షలో ఆయన మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ చల్లే పరిస్థితి కూడా లేదన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచ్‌ల హక్కులను కాలరాశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. వీరి దీక్షకు టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్, కఠారి హేమలత, సీఆర్ రాజన్ సంఘీభావం తెలిపారు. పంచాయతీ నిధులను దారి మళ్లించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక పంచాయతీ వ్యవస్థే కనుమరుగైపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారు గ్రామాల్లో పనులు చేయకపోవడంతో ప్రజల నుంచి ఛీత్కారాలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ దీక్షలో సర్పంచుల సంఘం నేతలు చుక్కా ధనుంజయ యాదవ్, కుప్పాల మురళి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలి

● రెండో రోజు కొనసాగిన సెర్ప్ ఉద్యోగుల దీక్ష



చిత్తూరు, జనవరి 30: ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ సెర్ప్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం స్కేల్‌ను వర్తింపచేయాలని, హెచ్‌ఆర్ఏ, ఈపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ డిమాండు చేశారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆ సంఘ నేతలు ప్రభాకర్, రజని, సుధాకర్, ఉమాపతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన గణేష్



గణేష్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం, జనవరి 30: ఎస్ఆర్‌పురం మండలం తయ్యూరు పంచాయతీ 50 బసివిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గణేష్ అంతర్జాతీయ దివ్యాంగుల టీ-20 క్రికెట్ సిరీస్‌లో పాల్గొన్నారు. నేపాల్‌పై ఘన విజయం సాధించిన భారత్ జట్టులో కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా 49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన గణేష్‌ను మంగళవారం పాఠశాలలో తహసీల్దార్ జెన్నూరాజ్, హెచ్‌ఎం శాంతి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ విజయబాబు సన్మానించారు. రెడెప్ప నాయుడు, మహ్మద్ సాకేత్, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం, ధనంజయ, శిండి ప్రసాద్, రమేష్, గాయత్రి, హేమలత పాల్గొన్నారు.

దుర్గసముద్రం అడవిలో పులి సంచారం

● మృతి చెందుతున్న పశువులు

చౌడేపల్లె, జనవరి30: చౌడేపల్లె మండలం దుర్గసముద్రం సమీప అడవిలో పులి సంచరించి పశువులపై దాడి చేస్తోందని గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఈ పంచాయతీలోని గాండ్లపల్లెకు చెందిన రైతుల ఆవులు, మేకలు వారం రోజుల నుంచి మేపు వెళ్లి తిరిగి రావడం లేదు. ఈ క్రమంలో సోమవారం రైతు జల్లప్ప తన మేకలను మేత కోసం అడ్డగుట్ట సమీపంలో మేపుకొని ఇంటికి తిరిగొచ్చారు. మందలో రెండు మేకలు కనిపించక పోవటంతో సమీప రైతులతో కలిసి మంగళవారం అటవీ ప్రాంతంలో వెదికారు. అంకాలమ్మ గుడి సమీపంలోని తలమడుగు అటవీప్రాంతంలో వెంకటరమణకు చెందిన వారం ముందు తప్పిపోయిన పాడి ఆవు కళేబరం కనిపించింది. ఆవు మృతి చెందిన విధానం పరిశీలించగా పులి దాడి చేసినట్లు గుర్తించారు. పశువులపై పులి దాడి చేయటం తాము చూసినట్లు అక్కడి యానాదులు చెప్పారని గ్రామస్తులు అంటున్నారు. దీంతో వీరు పశువులను మేత కోసం అటవీప్రాంతం వైపు తోలుకెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ నెమలి




నెమలిని అటవీశాఖ అధికారులకు అందజేస్తున్న రైతు సురేంద్ర

బంగారుపాళ్యం, జనవరి 30: వీధికుక్కల దాడిలో నెమలి గాయపడింది. కుక్కల నుంచి తప్పించుకుని నలగాంపల్లె సమీపంలోని ఎన్‌పీ సురేంద్ర నాయుడు మామిడి తోటలో మంగళవారం స్పృహ కోల్పోయి పడి ఉంది. దీనిని గమనించిన ఆ రైతు నెమలికి ప్రథమ చికిత్స అందించారు. ఈయన సమాచారంతో ఎఫ్ఎస్‌వో శివకుమార్ అక్కడికి చేరుకుని నెమలిని చిత్తూరు రేంజ్ ఆఫీసుకు తరలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలేవీ?

చిత్తూరు రూరల్, జనవరి 30: చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ జాబితాలో ఏవైనా తప్పులుంటే ఓటర్లు పరిశీలించుకొని సవరణ చేసుకోవచ్చని సూచించారు. అయితే ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఏ పోలింగ్ కేంద్రాల వద్ద కూడా ఓటర్ల జాబితా అందుబాటులో లేదు. జాబితాలో తమ ఓటు ఉందా లేదా అనేది ఎలా చూసుకోవాలంటూ ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. పేరుందా లేదా అని తెలుసుకోవాలంటే ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాలకు ఎలా రావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ వచ్చినా వందలాది పేజీలున్న జాబితాలో తమ పేర్లను ఎలా కనుగొనాలో తెలియక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగినా సమాధానం ఇవ్వడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రచురించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే బదులు 'ఆసరా'కు వైసీపీ ఇన్‌చార్జి



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 30: ప్రభుత్వ కార్యక్రమల్లో ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు కాకుండా వైసీపీ ఇన్‌చార్జి సునీల్ కుమార్ పాల్గొంటున్నారు. బంగారుపాళ్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కును అందించారు. ఎంపీపీ అమరావతి, కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయ రెడ్డి, సర్పంచులు ఉమాదేవి కృష్ణమూర్తి, వాణిప్రియ, ఎల్లప్ప, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కామరాజ్ ఫామ్‌హౌస్‌లో సునీల్ విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.







బెంచీని ఎత్తనీయకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతలు, వాకర్స్ - బెంచీలను లారీలో ఎక్కిస్తున్న నగరపాలక సిబ్బంది - పోలీసులతో దొరబాబు, నేతల వాగ్వాదం

బెంచీలు తీసేయాల్సిందే

- ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందాం
- కమిషనరు అత్యుత్సాహం
- కట్టమంచి చెరువు కట్టపై జీజేఎం ట్రస్టు ఏర్పాటు చేసిన బెంచీల తొలగింపు
- వైసీపీ నేతల ఒత్తిడితో ఇలా చేశారంటూ టీడీపీ ఆగ్రహం

చిత్తూరు, జనవరి 30: వాకింగ్ సమయంలో సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని వాకర్స్ అడిగారు. ఆ మేరకు చిత్తూరు కట్టమంచి చెరువు కట్టపై జీజేఎం ట్రస్టు ఛైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్మోహన్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటికి అనుమతి లేదంటూ మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు వచ్చి తొలగించేందుకు యత్నించారు. ప్రజావసరాలకు ఏర్పాటు చేశామని.. అనుమతికి దరఖాస్తు చేసుకుంటామని టీడీపీ నేతలు చెప్పినా పట్టించుకోలేదు. ముందు తీసేయండి.. ఏమైనా ఉంటే ఆ తర్వాత మాట్లాడుకుందామంటూ కమిషనరు అరుణ స్పష్టంచేశారు. మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం వెనుక వైసీపీ నేతలు ఉన్నారంటూ టీడీపీ నేతలు ఆగ్రహించారు. ఆరు నెలలుగా జీజేఎం ట్రస్టు తరపున గురజాల జగన్మోహన్ చిత్తూరు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వాకర్స్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి మేరకు రెండు రోజుల కిందట కట్టమంచి చెరువు కట్ట మీద బెంచీలను ఏర్పాటు చేశారు. వాటిపై గురజాల జగన్మోహన్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ అని ఉంది. బెంచీలకు పసుపు రంగు ఉంది. నగరపాలక అధికారులు మంగళవారం అక్కడకు చేరుకుని బెంచీలు పెట్టడానికి అనుమతి లేదని, తొలగించాలన్నారు. దీనిపై టీడీపీ నాయకులు.. వాకర్స్, అధికారుల మధ్య వాగ్వాదం జరుగుతుండగానే సిబ్బంది బెంచీలను లారీలో పెట్టేశారు. ఈ క్రమంలో కొన్ని విరిగిపోయాయి.

అధికారులను నిలదీసిన టీడీపీ నేతలు

టీడీపీ శ్రేణులతో పాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పలువురు నేతలు అక్కడికి చేరుకున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి స్థలంలో బెంచీలను ఏర్పాటు చేస్తే నగరపాలక అధికారులకు అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. వాకర్స్, ప్రజలు సేదతీరడం వల్ల కలిగే నష్టమేంటని నిలదీశారు. నగరంలోనూ వైసీపీ ఫ్లెక్సీలను వదిలేసి తమవే తీసేయడంలో ఆంతర్యం ఏమిటంటూ ఆగ్రహించారు. వైసీపీ అరాచకాలకు అంతు లేకుండా పోతోందన్నారు. ప్రజలకు మంచి చేయక పోగా చేసే వారిని అడ్డుకోవడం తగదన్నారు. అనుమతి కోసం రెండు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైందన్నారు. అధికారులు చేయాల్సిన పనిని దాతలు చేస్తుంటే ప్రోత్సహించాల్సింది పోయి అడ్డుకోవడం దారుణమన్నారు. సంఘటనా స్థలం వద్ద టీడీపీ నేతలిచ్చే వివరణనూ కమిషనరు అరుణ పట్టించుకోలేదు. బెంచీలను తొలగించాలంటూ కార్మికులను ఆదేశించారు. 'వాకర్స్ అడిగితే ఏర్పాటు చేశాం. ఇప్పుడు అనుమతికి దరఖాస్తు చేసుకుంటాం. పసుపు రంగు తీసేసి వేరే రంగు వేస్తాం. వీటిని తొలగించకండి' అని టీడీపీ నాయకులు, జగన్మోహన్ కార్యాలయ సిబ్బంది చెప్పినా ఆమె పట్టించుకోలేదు. దీంతో వారు బెంచీలను తీసుకెళ్లిపోయారు.

ఫ్లెక్సీల తొలగింపులోనూ పక్షపాతం

ఈనెల 15వ తేదీన గురజాల పుట్టినరోజు సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 17వ తేదీనే అధికారులు దగ్గరుండి తొలగించారు. అనేక ప్రధాన సర్కిళ్లలో వైసీపీ నేతల బ్యానర్లున్నా పట్టించుకోలేదని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ నెల 24న నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా 50 ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి కోరితే రోజంతా వేచి ఉన్నాక 30కి అనుమతి ఇచ్చారు.



తొలగించే క్రమంలో దెబ్బతిన్న బెంచీలు

ముద్దనపల్లెలో జల్లికట్టు





జనసమూహం మధ్య దూసుకెళ్తున్న ఎద్దులు

రామకుప్పం, జనవరి 30: రామకుప్పం మండలం ముద్దనపల్లెలో మంగళవారం జల్లికట్టు నిర్వహించారు. దీనిని చూసేందుకు వచ్చిన వారితో గ్రామం జనసంద్రంగా మారింది. జల్లికట్టు పరుగుపందెంలో గెలిచే ఎద్దులకు ముందుగానే బహుమతులు ప్రకటించారు. తొలి ఆరు బహుమతుల కింద వరుసగా రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలతో పాటు మరో 19 నగదు బహుమతులు, మరో 81బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు 15 రోజులుగా ప్రచారం చేశారు. దీంతో వందలాది మంది రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. గంగమ్మ ఆలయంలో పూజల అనంతరం డప్పుల హోరు మధ్య తమ ఎద్దులను బరిలో పరుగులు తీయించారు. మెరుపు వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఒకరిద్దరికి.. ఓ ఎద్దుకు గాయాలయ్యాయి. సాయంత్రం ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

3500 టన్నుల రాగులు వెనక్కి

కార్డుదారుల అనాసక్తి.. మార్చి నుంచి రాగిపిండి ఇస్తారంట

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: నెలల తరబడి మండల స్థాయి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్న 3500 టన్నుల రాగులను ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం వెనక్కి పంపింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొన్ని మండలాలు మినహా మెజార్టీ మండలాల్లో రాగుల వినియోగం తక్కువే. గతేడాది జూలై నుంచి బియ్యం స్థానంలో ప్రతి కార్డుదారుకు మూడు కిలోల రాగులను పంపిణీ చేశారు. నాసిరకంగా ఉన్నాయంటూ వీటిని తీసుకునేందుకు కార్డులు అనాసక్తి చూపారు. దాంతో రాగులు ఎం.ఎల్. పాయింట్లలో నెలలతరబడి నిల్వ ఉండిపోయాయి. ఎండలకు, వర్షానికి పాడైపోయాయి. రెండు నెలల క్రితం జేసీ శ్రీనివాసులు బియ్యం స్థానంలో రాగులును తీసుకుని పంపిణీ చేయాలని డీలర్లపై ఒత్తిడి తెచ్చినా తీసుకెళ్లలేదు. కాగా, నిల్వవున్న రాగులును మిల్లింగ్‌చేసి మార్చి నుంచి కేజీ ప్యాకెట్ల రూపంలో ఉచితంగా రాగిపిండి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో అధికారుల సూచన మేరకు నిల్వవున్న రాగులను వారం కిందట సమీప మిల్లులకు పంపించారు.

జగన్ ఎన్ని కుట్రలు చేసినా బాబు వెంటే జనం : అమర్



పలమనేరు, జనవరి 30: సీఎం జగన్‌రెడ్డి ఎన్నికుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలంతా బాబు వెంటే ఉన్నారని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్‌రింగ్‌రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని ఆయన స్వాగతించారు. పలమనేరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక చెంప పెట్టు లాంటిదన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చుగానీ ఖచ్చితంగా గెలుస్తుందని జగన్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఆయన అనాలోచిత చర్యల కారణంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వైసీపీని వీడుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేలను మరో సీటుకు జగన్ మారుస్తున్నారంటూ విమర్శించారు. తనకు కేటాయించిన తిరుపతి లోక్‌సభ సీటును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరస్కరించడాన్ని ఆయన ప్రస్తావించారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు : ఆర్ఐవో



మాట్లాడుతున్న ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, పక్కనే డీఈసీ సభ్యులు

తిరుపతి(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీజూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, హైస్కూల్స్ ప్లస్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20 తేదీవరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ కోర్సులకు అదేనెల 11నుంచి 20వ తేదీవరకు రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. 138 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 22,454మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక అధికారి విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, తులసీ రామిరెడ్డి, వి.బాబుపాల్గొన్నారు.

2న ఎథిక్స్, 3న పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి. ఈపరీక్షలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈపరీక్ష పాసైతేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్లు పెద్ద మార్కుల జాబితా వస్తుందని ఆర్ఐవో తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని(2014-15నుంచి గతేడాదివరకు) విద్యార్థులు కూడా పరీక్షను రాసే వెసులుబాటు ఉందని చెప్పారు.

అగ్రరాజ్యంలో మెరిసిన అనంత రవి తేజం

అమెరికాలో ఈబీ-1 వీసా పొందిన తిరుపతి యువకుడు

యాపిల్ కంపెనీ రీసెర్చ్ సైంటిస్ట్‌గా రూ. 5.3 కోట్ల వార్షిక వేతనం



యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్‌తో..

తిరుపతి రూరల్, జనవరి 30: అగ్రరాజ్యం అమెరికాలో అనంత రవితేజ అనే తెలుగు యువకుడు మెరిశాడు. తిరుపతికి చెందిన ఇతను ఈబీ-1 వీసా (ఐన్‌స్టీన్ వీసా) పొందాడు. అసాధారణ ప్రతిభను చూపిన వ్యక్తులకు మాత్రమే ఇలాంటి గుర్తింపు లభించడం గమనార్హం. దీనిపై తిరుపతి నలంద నగర్‌లో ఉంటున్న ఈయన తల్లిదండ్రులు నీలిమ, రమేష్ నాయుడితోపాటు నగరవాసులూ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడికి ఈబీ-1 వీసా రావడం సంతోషంగా ఉందన్నారు. తమ స్వగ్రామం చంద్రగిరి మండలం పుల్లయ్యగారి పల్లె అని తెలిపారు.

ప్రస్థానమిలా..

తిరుపతి బాలాజీ కాలనీలోని కేంబ్రిడ్జ్ స్కూల్లో రవితేజ ప్రాథమిక విద్యాభ్యాసం, బెంగళూరులో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్, హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. తొలుత అమెరికాలో బ్లూబర్గ్ కంపెనీలో రీసెర్చ్ ఇంజనీర్‌గా ఏడాదిపాటు పనిచేశారు. వాషింగ్టన్ స్టేట్‌లో ఉన్న యాపిల్ కంపెనీలో పలు స్థాయిల్లో పనిచేసి, రూ.5.3 కోట్ల వార్షిక వేతనంతో ఏడాది కిందట ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పదోన్నతి పొందాడు. ఈక్రమంలో రవితేజకు ఈబీ-1వీసా మంజూరు చేయాలన్న యాపిల్ కంపెనీ చేసిన విన్నపాన్ని అమెరికన్ ప్రభుత్వం ఆమోదించింది. ఈబీ-1 వీసీ ద్వారానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అమెరికాలో అడుగు పెట్టారు. అమెరికన్ జర్నల్స్‌కు పదబంధాల(క్రాస్ వర్డ్స్)ను రూపొందించిన ముంబై వాసి మంగేష్ గోగ్రేకు కూడా ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈబీ-1 వీసాను ప్రకటించిన విషయం తెలిసిందే.



జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి లోతైన పరిశోధన చేయాలని ఉంది. దీనిద్వారా అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా జీవన ప్రమాణాల పెంపొందించేందుకు కృషి చేస్తా. ఇందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి.. తద్వారా ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని భావిస్తున్నా.

\- అనంత రవి తేజ

రిజిస్ట్రేషన్లకు చివరి వేలిముద్ర లేదిక

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో క్రయవిక్రయదారుల నుంచి చివరి వేలిముద్ర స్వీకరణకు ప్రభుత్వం మంగళం పాడింది. ఈ మేర మార్పులు చేస్తూ జారీ అయిన జీవో.. మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లకు క్రయవిక్రయదారుల ఫొటోలు, వారి ఆధార్‌కార్డు నెంబర్లతో దస్తావేజు తయారవుతుంది. ఈకేవైసీ చేశాక క్రయవిక్రయదారులు వేలిముద్రలు వేస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో సబ్‌రిజిస్ట్రార్ అథెంటికేషన్ చేస్తారు. దాంతో ఆ దస్తావేజుకు సంఖ్య వస్తుంది. దానిపై సబ్‌రిజిస్ట్రార్ ఈ-సైన్ చేస్తారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో క్రయవిక్రయదారులు చివరిసారిగా వేలిముద్రలు వేస్తారు. వారితో పాటు ఇరువురు సాక్షులు డాక్యుమెంట్ చివరిపేజీలో సంతకాలు చేస్తారు. రిజిస్ట్రేషన్ చివరిలో దస్తావేజులు నిబంధనల మేర ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్ సంతృప్తి పొంది ఈ-సైన్ చేయడంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తవుతుంది. ఈ ప్రక్రియ సందర్భంగా తొలిసారి వేసిన వేలిముద్రే సరిపోతుందని సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో మరోసారి వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదంటూ చట్ట సవరణ జరిగింది.

ఆగస్టులోగా 12 మంది తహసీల్దార్ల పదవీ విరమణ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ప్రభుత్వం పదవీ విరమణ కాలాన్ని రెండేళ్ల పాటు పెంచిన నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 12మంది తహసీల్దార్లు పదవీ విరమణ చేయనున్నారు. 60 ఏళ్లకే పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఉద్యోగులకు ప్రభుత్వం గతంలో రెండు సంవత్సరాల పదవీ విరమణ కాలాన్ని పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో జనవరి 31 నాటికి అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె తహసీల్దార్ సీఆర్ మంజుల, ఫిబ్రవరి 29 నాటికి విజయపురం తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, పలమనేరు ఆర్డీవో కార్యాలయం ఏవో ఎం.ప్రసాద్ బాబు, బి.కొత్తకోట తహసీల్దార్ ఎస్.రఫీఅహ్మద్ పదవీ విరమణ చేస్తారు. ఏప్రిల్ 30నాటికి కురబలకోట తహసీల్దార్ డీసీ కృష్ణమోహన్.. మే 31న ఐరాల తహసీల్దార్ పి. సుశీల, పలమనేరు తహసీల్దార్ ఇ.జి.కుప్పస్వామి, తవణంపల్లె తహసీల్దార్ కె. గురుశేఖర్ రెడ్డి.. జూన్ 30న పూతలపట్టు తహసీల్దార్ వై.విజయభాస్కర్, కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరన్.. ఆగస్టు 31న కుప్పం ఆర్డీవో కార్యాలయ ఏవో ఎన్ఎస్ కృష్ణకుమార్ పదవీ విరమణ చేయనున్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 255 మంది

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: చిత్తూరులోని సీటమ్స్‌లో మంగళవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకుగాను 255 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 127మంది .. మధ్యాహ్నం 128 మందికి అందరూ హాజరయ్యారన్నారు.

అప్పుల బాధ తాళలేక యువఫొటోగ్రాఫర్ ఆత్మహత్య


నూర్ అలీ (ఫైల్)

పీలేరు, జనవరి 30: వ్యాపార విస్తరణ, నిర్వహణ కోసం చేసిన అప్పుల బాధ తాళలేక పీలేరు పట్టణం సదుం రోడ్డుకు చెందిన యువఫొటోగ్రాఫర్ నూర్ అలీ(29) ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంత కాలంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్న అతను మంగళవారం సాయంత్రం తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు అతనిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం అతని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

నాటు తుపాకీ స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

పెద్దమండ్యం, జనవరి 30: నాటు తుపాకీ స్వాధీనం చేసుకొని పి. సుధాకర (25) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్‌ఐ రామాంజనేయుడు మంగళవారం వెల్లడించారు. పెద్దమండ్యం మండలం గుర్రంవాండ్లపల్లి గ్రామ పంచాయతీ నక్కలవారికోటకు చెందిన సుధాకర సోమవారం నాటుతుపాకీ కలిగి ఉండగా మల్లెంకొండ వద్ద అరెస్టు చేసి తుపాకీ స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం సుధాక ర్‌ను తంబళ్లపల్లి కోర్టు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

పెద్దమండ్యం, జనవరి 30: పెద్దమండ్యం మండలం వెలిగల్లు గ్రామ సమీపంలో మూడు వరి గడ్డి వాములు దగ్ధమైనట్లు బాధిత రైతులు రమణ, ప్రసాద్ వెల్లడించారు. వరి పంట వడిపిన అనంతరం మేత గడ్డిని గ్రామ సమీపంలో బండపై వాములు వేసుకున్నారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పు పెట్టి ఉంటారని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ. 60వేలు విలువ చేసే గడ్డి కాలిబూడిద అయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉచిత పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, జనవరి 30: ములకలచెరువు సమీపంలో మంగళవారం దాడులు నిర్వహించి ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.4650లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్యమత ప్రచారం అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది

మదనపల్లె టౌన్, జనవరి 30: మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో ఓ మహిళ అన్యమత ప్రచారం చేస్తుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఓ మహిళ వార్డుల్లోకి వెళ్లి అక్కడ వున్న రోగులకు కరపత్రాలు పంచుతూ మత ప్రచారం చేస్తుండగా విషయం గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను అడ్డుకుని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వాస్పత్రిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, ఇంకోసారి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎంఎస్ హెచ్చరించారు.

బాబా అబ్దాల్ హుస్సేనీ ఉరుసు

మదనపల్లె, జనవరి 30: బసినికొండలోని బాబా అబ్దాల్ హుస్సేనీ దర్గా ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులోభాగంగా బుధవారం గంధం, ఫిబ్రవరి ఒకటో తేదీన ఉరుసు ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు జాకీర్, షేక్ రియాజ్, జాఫర్‌హుస్సేనీ, ఏడీ ఖాదర్‌వలి, షామీర్‌బాషా, ఏడీ మస్తాన్‌లు పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసీపీకి చెంపపెట్టు


మదనపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్


పీలేరులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, జనవరి 30: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీంకోర్టు తీర్పు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్ పాలనతో రాష్ట్రం 13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఇరుక్కుపోయిందన్నారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో నివేదిక ప్రకారం రాష్ట్రంలో మహిళలపై నేరాలు 43 శాతం పెరిగాయన్నారు. వైసీపీ, జగన్‌పై అసంతృప్తిగా ఉన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలలే పార్టీ వీడుతున్నారన్నారు. దీంతో జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మదనపల్లె టౌన్‌లో: ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉందని మదనపల్లె టీడీపీ పట్టణ అధ్యక్షుడు జోళిపాలెం భవానిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో భవానిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అవినీతి కార్యక్రమాలపై పోరాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు బనాయించి 53 రోజుల పాటు జైలులో ఉంచారన్నారు. ఈ కేసులపై ముందస్తు బెయిల్‌పై వచ్చిన చంద్రబాబుపై కసితో జగన్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారన్నారు. కాని ధర్మమే ఎప్పటికి గెలుస్తుందని, చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్ సరైనదే అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెబుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నా రు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్‌ఎం రఫి, తులసీధర్‌నా యుడు, దేవరింటి శ్రీనివాసులు, చల్లా నరసింహులు, కత్తి లక్ష్మన్న, మేకల రెడ్డిశేఖర్, ప్రభాకర్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్‌ఆర్) కేసులో సుప్రీంకోర్టు తీర్పు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని పీలేరుకు చెందిన టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పీలేరులోని పార్టీ కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడారు. కేవలం కక్షసాధింపు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌ఆర్ కేసులో సుప్రీంకోర్టును ఆశ్ర యించిందన్నారు. తన వ్యక్తిగత ప్రాధాన్యాతల కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ముఖ్యమంత్రి దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇటీవల పీలేరులో జరిగిన సభకు కూడా ప్రజలు నభూతో.. నభవిష్యతి అన్నట్టు తరలి వచ్చారని, వారందరికీ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి, మండల అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రెడ్డప్పరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, రియాజ్, స్పోర్ట్స్ మల్లి, ఆర్బీఐ రమణారెడ్డి, షౌకత్‌అలీ, రెడ్డిముని, సురేశ్, షామియాన జయన్న, కోటపల్లె శ్రీనాథరెడ్డి, కేజీఎన్ రెడ్డిబాషా, సుబ్బయ్య, అప్పస్వామి, భాస్కర, శ్రీరాములు, కృష్ణయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ భవనాల్లో ఆసుపత్రుల ఏర్పాటుపై చర్యలు తీసుకోండి


మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్

మదనపల్లె, జనవరి 30: మున్సిపాలిటీలో భవనాలకు రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని, కార్పొరేట్ ఆసుపత్రులు నడుపుతున్న యాజమానులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువజనసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఎక్కడ చూసినా ఇలాంటి ఆసుపత్రులే ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో ఏదైనా అనుకోని రీతిలో ప్రమాదం సంభవిస్తే, అక్కడి నుంచి భయటపడే అవకాశాలు తక్కువగా ఉండే విధంగా నిర్మాణాలు ఉన్నట్లు తెలిపారు. అంతకు ముందు పునీత్‌కుమార్, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంతోపాటు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రులు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ భవనాలను కమర్షియల్ కిందకు మార్పు చేయాలని లేకుంటే, లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని పునీత్‌కుమార్ హెచ్చరించారు.

కులగణన సర్వే వేగవంతం చేయాలి

తంబళ్లపల్లె, జనవరి 30: మండలంలో నిర్వహిస్తున్న కులగణన సర్వే వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ ఆదేశించారు. మంగళవారం పరుసతోపు పంచాయతీలో నిర్వహిస్తున్న కులగణన సర్వేను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేసి ఫిబ్రవరి 4వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

క్రీడాపోటీల్లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ


పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మదనపల్లె టౌన్, జనవరి 30: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ అథ్లెటిక్ పోటీల్లో మదనపల్లె శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ 100 మీటర్ల పరుగు పందెంలో కె.రుచిత బంగారు పతకంతో పాటు, 200 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 100 మీటర్ల హార్డిల్స్ పందెంలో రజత పతకం సాధించిందన్నారు. అలాగే 400 మీటర్ల రిలే పరుగుపందెంలో రుచిత, సుజిత, మానస, కీర్తన జట్టు రజతపతకం సాధించిదన్నారు. 1500 మీటర్ల పరుగు పందెంలో పద్మశ్రీ రజత పతకం, వీరితో పాటు జావెలిన్‌త్రోలో సుమంత్ రజతపతకం సాధించారన్నారు. నియోజకవర్గ స్థాయిలో మదనపల్లెలో నిర్వహించిన ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో రామారావు కాలని, ఎస్‌బీఐ కాలని సచివాలయాల తరఫున పోటీ చేసిన తమ విద్యార్థులు బాలికల విభాగంలో క్రికెట్, కబడ్డీలో విన్నర్స్‌గా నిలిచి కప్పు సాధించారన్నారు. అలాగే ఖోఖోలో కూడా రన్నర్స్‌గా నిలిచారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులకు కమిషనర్ ప్రశంస

బి.కొత్తకోట జనవరి 30 : తంబళ్లపల్లె నియోజక వర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా లో ప్రతిభ చూపిన పట్టణ క్రీడాకారులకు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్ ప్రశంసించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గ్రామ, మండల స్థాయిని దాటి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలచిన నగర పంచాయతీ పరిధిలోని పలువురు క్రీడాకారుల అభినందన కార్యక్రమం మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఇందులో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో తదితర విభాగాల్లో ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలచిన సైఫుల్ల, దివ్య, రజని, సందీప్, తదితరులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను కమిషనర్ అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి.కొత్తకోటకు చెందిన క్రీడాకారులు మొదటి స్థానంలో నిలవడం అభినందించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

పెద్దతిప్పసముద్రం జనవరి 30 : మండలంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారులు సూచించారు. స్థానిక పీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్తానీ తమ వైద్య సిబ్బందితో కలసి మంగళవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత శుభ్రత పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. జీసీడీవో రాయచోటి రాధ ఆదర్శ పాఠశాల హాస్టల్‌ని సందర్శించారు. ఎంఈవో నారాయణ, గౌస్‌పీర్, పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి, పాల్గొన్నారు.

నేడు టి.సదుంలో జయహో బీసీ సదస్సు

పెద్దతిప్పసముద్రం జనవరి 30 : టి.సదుం గ్రామంలో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు.

నిమ్మనపల్లిలో: నిమ్మనపల్లెలో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ బీసీ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మన్న, మండల అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలు బీసీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి


పీలేరులో నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు


మదనపల్లెలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

పీలేరు, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ వర్థంతిని పురస్కరించుకుని పలువురు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం పీలేరులోని ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్, వాసవీ ఫ్రెండ్స్ అసోసియేషన్ నాయకులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూనా సత్యం, రేవూరి సుధీర్, సురేశ్, పామిడి జయచంద్ర, ఫణి, తులసీ, కృష్ణమూర్తి, అరవింద్, పామిడి నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని పట్టణంలో మంగళవారం పలు చోట్ల నిర్వహి ంచారు. ఇందులో భాగంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహా నికి ఏపీ వాల్మీకి సంఘం అధ్యక్షుడు పులి శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సద్దల జయసింహ, వలసల మంజునాథ్, కలిచర్ల నరసింహులు, బొంత రామకృష్ణ, కోనే వెంకటరమణ,రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించకుని గాంధీజీ విగ్రహానికి మదనపల్లె వాసవఈక్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆఫీసర్ కెఎస్‌కృష్ణమూర్తి, వెంకటేష్‌బాబు, మదనపల్లె వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, అమరనాథ్, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, కోశాధికారి లక్ష్మీదీపక్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహమూద్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, రాజశేఖర్, మహబూబ్‌బాష, శివయ్య, అయూబ్ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పలువురు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న అవార్డు గ్రహీత కర్పూర్ ఠాగూర్‌కు ఘన నివాళి

మదనపల్లె అర్బన్, జనవరి 30: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాగూర్ కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం జాతికే గర్వకారణమని నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మణి అన్నారు. మంగళవారం స్థానిక అమ్మచెరువుమిట్టలో నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌లో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తమ జాతిని గుర్తించి భారతరత్న అవార్డును ఠాకూర్‌కు ప్రదానం చేసిన పీఎం మోదీకి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి ఫోర్‌మెన్ కమిటీ ఏర్పాటు


టీడీపీ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, జనవరి 30: మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఫోర్‌మెన్ కమిటీని నియమించామని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫోర్‌మెన్ కమిటీలో పొలిటికల్ మేనేజర్‌గా కత్తి లక్ష్మన్న, మీడియా కోఆర్డినేటర్‌గా ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, అడ్మినిస్టేటివ్ మేనేజర్‌గా మల్లెం ప్రకాష్‌నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కాశీ శ్రీరామ్‌లను నియమించామన్నారు. వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా పనిచేస్తూ ఈ రెండున్నర నెలలు కష్టపడాలని సూచించారు. కాగా ఫోర్‌మెన్ కమిటీని స్థానిక టీడీపీ నాయకులు అభినందించారు.

గిరిజనులకు హౌసింగ్ పట్టాల మంజూరులో నిర్లక్ష్యం


అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న దళిత సంఘాల నేతలు

పీలేరు, జనవరి 30: గిరిజనులకు హౌసింగ్ బిల్లులు, ఇంటి పట్టాల మంజూరులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) నేత పాలకుంట శ్రీనివాసులు ఆరోపించా రు. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ ఆరంవారిపల్లె గిరిజన కాలనీలో మంగళవారం రెవెన్యూ అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఇళ్లు కట్టుకుంటే బిల్లులు పట్టాలు మంజూరు చేస్తామని చెప్పిన హౌసింగ్, రెవెన్యూ అధికారులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర గిరిజన సమాఖ్య నాయకుడు కిల్లా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరంవారిపల్లెలో నేటికీ సిమెంటు రోడ్లు, వీధి దీపాలు లేకపోవడం దారుణమన్నారు. శ్మశాన వాటిక లేక గ్రామంలో ఎవరైనా మరణిస్తే సమీప చెరువులో ఖననం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉన్నదని ప్రత్యేకంగా నీటి ట్యాంకు నిర్మించి సమస్య తీర్చాలని గ్రామస్థులు అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ధనంజయులు, ఎంపీడీవో డాక్టర్ మురళీ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ రమణ, ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి, ఏపీవో మహేశ్వర, ఏవో రమాదేవి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు మల్లిఖా ర్జున, వెంకటేశ్, ఆనంద, నాగేంద్ర పాల్గొన్నారు.

విశాఖ డీపీటీవోపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు, కార్మికులు

పీలేరు, జనవరి 30: కార్మికుల పట్ల నియంతృత్వ, అప్రజాస్వామిక పోకడలతో కక్ష సాధిస్తున్న విశాఖపట్నం డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని పీలేరులోని ఎన్‌ఎంయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ డీపీటీవో వైఖరిని నిరసిస్తూ మంగళవారం వారు స్థానిక డిపో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పీఎస్‌ఎం రాజు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమించిన కార్మిక నాయకులు, కార్మికులను విశాఖ డీపీటీవో అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. విశాఖలో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా తాము ధర్నా చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీవీ రమణ, నాగరాజు, ఆదినారాయణ, సుబ్బరామయ్య, సురేంద్ర, రఘు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న వన్‌డిపో అసిస్టెంట్ మేనేజరు రేవతి

మదనపల్లె అర్బన్, జనవరి 30: గ్రామీణా ప్రాంతాల్లో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు నడపకుండా మంగళవారం మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో అసిస్టెంటు మేనేజరు రేవతి పోలీసుల సహకారంతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. మదన పల్లె- పెద్దమండ్యెం, ఎన్‌పీ కుంట ప్రాంతాల్లో ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ప్రమాదమని చెప్పి ఆటోల నుంచి దింపేసి ఆటో వారిని ఎక్కువ లోడ్‌తో వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీలో సురక్షంగా ప్రయాణించాలని, గ్రామీణాప్రాంతాల్లో ఓఆర్ తగ్గితే బస్సుల సౌకర్యం లేకుండాపోతుందని సూచించారు. ఆర్టీసీ వలన ప్రయోజనాలను ప్రయాణికుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి

మదనపల్లె, జనవరి 30: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. జనంకోసం జనసేన కార్యక్రమం చేపట్టి మంగళవారంతో 50రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగ ఆపార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో భారీకేక్ కట్ చేసి జనసైనికులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ రామాంజనేయలు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యేవరకూ జనసేన-టీడీపీ శ్రేణులు ఇదే ఉత్సాహంతో ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, వీరమహిళలు మల్లిక, రూప, పద్మావతి, జయమ్మ, ప్రభావతి, రఘునాథ్, ఆకుల శంకర్, అశ్వత్, చంద్రశేఖర్, శ్రీనాథ్, ముఖేష్, అరవింద్ పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కార్యాలయ స్థలానికి గ్రీన్‌సిగ్నల్

మదపనల్లె, జనవరి 30: మున్సిపల్ నూతన కార్యాలయ భవనం నిర్మాణానికి మార్గం సుగుగమైంది. ఇందులో భాగంగా మండలంలోని బసినికొండ సర్వేనంబర్:235-5, 7నంబర్లలోని 1.76ఎకరాలను రెవెన్యూ శాఖ స్వాధీనం చేయగా, తర్వాత కార్యాలయం నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలను ముమ్మరం చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. స్థానిక మున్సిపల్ కార్యా లయంలో మంగళవారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఇందులో స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి 33కేవీ విద్యుత్తు లైన్ మార్పు చేయడానికి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.3కోట్లు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. కరోనా కష్టకాలంలో విధులు నిర్వహించి, వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న 80 మంది పారిశుధ్య కార్మికులకు సంబంధించి మొత్తం రూ.12.50లక్షలు చెల్లించేలా నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్‌ఆజాం, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

కరోనాతో మృతిచెందిన వైద్యసిబ్బందికి నివాళులు

మదనపల్లె టౌన్, జనవరి 30:కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి రోగులకు వైద్యం అందించి కరోనాతో మృతి చెందిన వైద్యసిబ్బందికి ప్రభుత్వాస్పత్రిలో క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించారు. మంగళవారం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యసిబ్బంది ఎనలేని కృషి చేశారన్నారు. వైద్యసేవల్లో వారు కరోనా బారిన పడి మృతి చెందడం విచారకరమని వారి ఆత్మలకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో ప్రసాదరాజు, డాక్టర్ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సదస్సు

మదనపల్లె అర్బన్, జనవరి 30: స్థానిక బహుజన కార్యాలయంలో ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.